క్లుప్తంగా

కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక


మూల కిరణ్‌గౌడ్

నర్మెట: కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మూల కిరణ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గోపగోని యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గోపగోని సుదర్శన్, ఉపాధ్యక్షులుగా బైరి యాదగిరి, మోహన్, కిష్టయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా గోపగోని రాకేష్, ముఖ్య సలహాదారులుగా గోపగోని శ్రీధర్, సతీష్, స్వామి, కార్యదర్శులుగా బైరగోని యాదగిరి, గొల్లపల్లి వీరస్వామి, బైరగోని చంద్రమౌళిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ గౌడ సంఘం..


కమిటీని ప్రకటిస్తున్న నాయకులు


నాగరాజు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టలో శనివారం గ్రామ గౌడ సంఘం నూతన కమిటీని సంఘం నాయకులు ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చిర్ర నాగరాజు గౌడ్ మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సమావేశం నిర్వహించిన అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. కమిటీ మెంబర్లుగా గాల్నె నాగరాజు, మోడేం లింగయ్య, మెరుగు చంద్రమౌళి, పెండ్యాల సాంరాజు, బత్తిని గణపతి, చిర్ర రాజు, ఎల్లగౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పటి లాగే కృషి చేస్తానన్నారు.

రోడ్డును బాగుచేయండి


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న పల్లా

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని రోడ్డును బాగుచేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. మండల కేంద్రానికి చెందిన పలువురు ఇటీవల్ల మండల కేంద్రం నుంచి కొడవటూర్ కమాన్ వరకు ఉన్న రోడ్డు, జనగామ–సిద్దిపేట రహదారి అధ్వానంగా మారిందని విన్నవించారు. కాగా, శనివారం ఎమ్మెల్యే ఆర్ అండ్ బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో రెండు రోజుల్లో రోడ్డు మరమ్మతు పనులు చేస్తామని అధికారులు చెప్పినట్లు వారు తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

జనగామ రూరల్: రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలని సాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు బందారపు లక్ష్మయ్య, కార్యదర్శి ఇంద్ర సేనరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. పెన్షనర్ల బకాయిలు ప్రభుత్వం 20 నెలలుగా చెల్లించకుండా పూటకోమాట మాట్లాడుతూ దాటవేస్తుందన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ పీఏసీఎస్ డైరెక్టర్



రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ మేడిపల్లి వెంకటేశ్వర్లు శనివారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బీజేపీ తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, అందుకు వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేణుకుమార్, కావటి ముత్యాలు, వెంకటేష్, రంజిత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

రఘునాథపల్లి: మండలంలోని శివాజీనగర్ గ్రామానికి చెందిన పలుపార్టీల కార్యకర్తలు శనివారం మాజీ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింగరావు, మాజీ సర్పంచ్ కొమురయ్య ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు చేరగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు.

‘నానో యూరియా’పై అవగాహన కరువు

- ఆసక్తి చూపని రైతులు
- ఎలా వాడాలో తెలియని అన్నదాతలు


నానో యూరియా పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)


నానో యూరియా

చిల్పూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగం ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని కొత్త పుంతలు తొక్కుతోంది. సాగులో ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడ్డారు. దీంతో రైతులు పంటలకు వేస్తున్న గుళికల రూపంలో ఉన్న యూరియా వల్ల భూసారం దెబ్బతింటోందని యూరియా వినియోగాన్ని తగ్గించేలా నానో యూరియా (ద్రవ రూపం) ను అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. కానీ దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు నానోను ఎలా వాడాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టక పోవడంతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నా అవగాహన లేక పోవడంతో దాని వినియోగంపై అనాసక్తి చూపి గుళికల యూరియా కోసమే బారులుదీరుతున్నారు. ఇప్పటి వరకు రైతులకు సాధారణ యూరియా చల్లడమే తెలుసు. నానో యూరియా వినియోగంపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తెలియ జేయాల్సి ఉంది.

నానో యూరియాతో అనేక ప్రయోజనాలు

నానో యూరియాతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు అంటున్నారు. సాధారణ యూరియాను పంటకు చల్లడం ద్వారా 30 శాతమే వెళ్తుంది. దీనికి తోడు యూరియా ఖర్చు ఎక్కువ. నానోతో తక్కువ ఖర్చు అవడమే కాకుండా 80 శాతం పంటకు వెళ్తుందని చెబుతున్నారు. అరలీటరు సీసాలో లభించే నానో 45 కిలోల యూరియా బస్తాతో సమానం. నానో రూ. 240 కే లభ్యం అవుతుండగా ఎకరాకు అరలీటరు సరిపోతుంది.

రైతులకు అవగాహన కల్పిస్తాం..



ఇక నుంచి గ్రామాల్లో నానో యూరియా వాడకంపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తాం. సాధారణ యూరియా కంటే నానో వాడకంతో రైతులకు మేలు చేకూరుతుంది. మండలంలో పలువురు రైతులు నానో యూరియా వాడుతున్నారు. పంటలకు ఎక్కువ మొత్తంలో త్వరగా చేరుతుంది. పంట వేసిన నెల తర్వాత నానో యూరియా వాడాలి.

– నజీరుద్దీన్, ఏఓ

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న నాయకులు

జనగామ: జిల్లా ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని అమ్మఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఉద్యమ నాయకులు మంతెన మణికుమార్, పండుగ నరేష్, అమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజ్ ఆధ్వర్యంలో సంజయ్‌నగర్‌లో వేడుకలను జరుపుకున్నారు. జిల్లా ఉద్యమకారులపై కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో మృతి చెందిన అమరులను గుర్తుచేసుకుని నివాళులర్పించారు. బిర్రు ఇస్తారి, చిక్కుడు నగేష్, బింగి నర్సింహులు, గొల్లూరి చందు, దాసరి క్రాంతి, శ్రీశైలం, ప్రశాంతి, ఉన్నారు.

చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ సెలవు రోజులలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నడిపిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర వేణు డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రెండో శనివారం ప్రభుత్వ సెలవు అయినప్పటికీ ఘన్‌పూర్‌లోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్కూల్‌ను నిర్వహించాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నారన్నారు. పాఠశాలల్లో నిబంధనల మేరకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల్ని విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్, డీఈఓ వెంటనే స్పందించి నిబంధనలు పాటించని ప్రైవేటు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్: దేశంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని నరేంద్ర మోదీ శనివారం కలెక్టరేట్‌లో వర్చువల్‌గా ప్రారంభించారు. వెనుకబడిన 100 జిల్లాల్లో జనగామ కూడా ఎంపిక అవడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి రైతుల పక్షాన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నర్మెట అధ్యక్షుడు రాజు నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి జగదీష్, అనిల్ జహంగీర్, శ్రీనివాస్, సంపత్, సునీల్, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యాలయంలో నర్మెట మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో బొక్క సునీల్, తోకల రాజు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో అనిల్, నక్క సంపత్, శ్రీనివాస్, రాజకుమార్ పాల్గొన్నారు.

‘ఏకమై రిజర్వేషన్లు సాధించుకుందాం’

కొడకండ్ల: బీసీ సంఘాలన్ని ఏకమై 42 శాతం రిజర్వేషన్లు వచ్చే దాక సమష్టిగా పోరాడి సాధించుకుందామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మగాని విక్రంగౌడ్ అన్నారు. శనివారం ఆయనిక్కడ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయమని, ఈ నిర్ణయానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిచ్చి బీసీలకు అండగా నిలవాలని ఆయన కోరారు. బీసీలను విస్మరించే వారికి రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని, బీసీ సంఘాలన్ని కూడా ఐక్యంగా 42 శాతం రిజర్వేషన్ల కోసం కల్సిగట్టుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ సావిత్రి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి

దేవరుప్పుల: జన్మనిచ్చే తల్లులతోపాటు పుట్టిన ప్రతి శిశువుకు తమ పరిసరాల్లో లభించే పౌష్టికాహారం సకాలంలో అందించినప్పుడు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వడ్లకొండ సావిత్రి సూచించారు. శనివారం కామారెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశం అనంతరం పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పు, చక్కెర, నూనె వాడకం తగ్గిస్తూ ఆకుకూరలు, కూరగాయలు తమ పరిసరాల్లో పెంచి తీసుకోవడం వల్ల సమతుల ఆహారం లభిస్తుందన్నారు. అత్యధిక ఉత్పత్తుల పేరిట రసాయన ఎరువుల వాడకంతో పోషక లోపాలు కలిగిన ఆహారం పదార్థాలను నివారించేలా ప్రతీఒక్కరు తమ పరిసరాల్లో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ దేవేంద్ర, రామతార, నిర్మల, రాములమ్మ, శోభ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: స్థానిక ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.రామారావును ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇరుగు రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

‘బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు’

పాలకుర్తి టౌన్: స్వాతంత్య్రం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ జనాభాపరంగా మేమెంతో మాకంత వాటా ఇవ్వకుండా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని మోకుదెబ్బ రాష్ట్ర నాయకుడు కమ్మగాని వెంకన్న ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో అయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుల గణన సర్వేలో బీసీలు 56 శాతం ఉన్నా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో విఫలమయ్యిందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో ఒక్కటై ఆమోదించుకున్నా, బీసీ రిజర్వేషన్ల కోసం ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బీసీ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాజకీయాలు మానుకొని కాంగ్రెస్, బీజేపీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, లేకపోతే జరగబోయే పరిణామాలకు రెండు పార్టీలు జవాబు చెప్పాల్సి వస్తుందని అన్నారు.

ఆర్థికసాయం



జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన మండల రాజు ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న గ్రామ హెచ్‌పీ పెట్రోల్ బంకు యాజమాన్యం బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం శనివారం అందజేసింది. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బంకు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

చిల్పూరు ఆలయంలో వారకల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం స్వామివారి వార కల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుల ఆధ్వర్యంలో చిల్పూరుకు చెందిన బొల్గాం శివశంకరయ్య–నాగేంద్రమ్మ, హైదరాబాద్‌కు చెందిన నాగేశ్వర్–ఉమారాణి, వెంకటేశ్వర్లు–పద్మావతి దంపతులు భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. హనుమకొండకు చెందిన నాగేశ్వర్‌రావు–విజయలక్ష్మి దంపతులు అన్నదానం కోసం రూ. 25 వేలు ఆలయానికి విరాళంగా అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ధర్మకర్తలు గణగోని రమేశ్, తాళ్లపల్లి బుచ్చయ్య, చల్లా వెంకటరమణాదేవి, నారాయణరెడ్డి వీరన్న,మల్లికార్జున్, హరిశంకర్, కృష్ణ, కుర్ర వసంత పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి


మంత్రితో కిషన్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు తలకాయల గుట్ట వద్ద ఉన్న శ్రీవైద్యనాథ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందకు సహకరించాలని కోరుతూ దేవాలయ నిర్వాహకులు, పూజారి భూనేటి కిషన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో గృహనిర్మాణ శాఖ మంత్రి, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పురాతన వైద్యనాథస్వామి దేవాలయ ప్రఖ్యాతి గురించి మంత్రికి వివరించారు. స్వామివారి భవ్య మందిర నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని మంత్రిని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో వేల్పుగొండ కొండ దిగువన ఉన్న లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వెంకటాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యుల, భక్తులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

బచ్చన్నపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో మండల ఇన్‌చార్జ్ బండకింది హరిబాబుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలనిఅన్నారు. ఈ సమావేశంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత, కొడవటూర్ దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎండీ మసూద్, ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య, మండల మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి


సీలింగ్ భూములను పరిశీలిస్తున్న నాయకులు

జనగామ రూరల్: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామంలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగోళ్లపాడు గ్రామంలోని 100 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమణలకు పాల్పడి అమ్ముకుంటున్నారని అన్నారు. గ్రామంలో గుంట భూమి కూడా లేని పేదలు అనేక మంది ఉన్నారని వారికి పంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సీలింగ్ భూమికి సర్వే నంబర్ లేకున్నా దొంగ సర్వే నంబర్‌తో అక్రమంగా పట్టా చేసుకుంటున్నారని తెలిపారు. ఉపేందర్ గ్రామ కార్యదర్శి, గుండెల్లి రాజు బైరగోని మల్లేశం, అజ్మీరా సురేష్ నాయక్, కాటబోయిన సిద్దులు, సార్ల భాస్కర్ పాలమాకుల క్రాంతి, పుట్ట శేఖర్, కొత్తపెల్లి సంపత్, వజ్జె సిద్ధులు పాల్గొన్నారు.

వార సంతల్లో వెతలు

- ఆదాయం ఉన్నా వసతులు కరువు


బచ్చన్నపేటలో రోడ్డుపై ఎండలో విక్రయిస్తున్న కూరగాయలు

బచ్చన్నపేట: వార సంతల్లో మౌలిక వసతులు లేక కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. గతంలో ప్రజలు కూరగాయలను కొనుగోలు చేసేందుకు బచ్చన్నపేట, నర్మెట, చేర్యాల సంతలకు వెళ్లేవారు. ఇటీవల కూరగాయల విక్రయదారులు వ్యాపారం సక్రమంగా ఉండాలని పలు గ్రామాల్లో వారాంతపు సంతలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో రోజుకో కూరగాయల విక్రయ సంతను ఏర్పాటు చేస్తున్నారు. సంతల్లో కూరగాయలే కాకుండా అన్ని నిత్యావసర వస్తువులు లభిస్తాయి. బచ్చన్నపేట మండల కేంద్రంలో విక్రయించే తాజా కూరగాయలను కొనుగోలు చేయడానికి మండల ప్రజలే కాకుండా సిద్దిపేట జిల్లాలోని మద్దూరు, అలాగే చేర్యాల, కొమురవెల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, రాజపేట మండలాలతో పాటు జనగామ మండలాల నుంచి వస్తారు. మండల కేంద్రంలోని సంతకు సంవత్సరానికి రూ.లక్షల ఆదాయం వస్తున్నా మౌలిక వసతులు కరువయ్యాయి. వేలం పాట డబ్బులను గ్రామ పంచాయతీ అధికారులు తీసుకోవడమే తప్ప సంతల్లో షెడ్లు వేసి వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఖాళీ ప్రదేశంలోకి మార్చాలి



బచ్చన్నపేట నుంచి ఆలేరు పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారిపై వారాంతపు సంతను నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంతను ఖాళీ ప్రదేశంలోకి మారిస్తే అందరూ వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తారు. సంత రోడ్డుపై ఉండడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వల్లకాటి జగన్, బచ్చన్నపేట

మూత్రశాలలు నిర్మించాలి



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారాంతపు సంతలో చాలా మంది మహిళలే కూరగాయలను విక్రయిస్తుంటారు. అలాగే అవి కొనుగోలు చేయడానికి కూడా మహిళలే అధికంగా వస్తుంటారు. సంతకు వచ్చే మహిళలు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారి సౌకర్యార్థం మూత్రశాలలను నిర్మించాలి.

– జల్లి స్వప్న, బచ్చన్నపేట

అసత్య ప్రచారం మానుకోవాలి


మాట్లాడుతున్న కుమారస్వామి గౌడ్

పాలకుర్తి టౌన్: బీసీ రిజర్వేషన్ల పై బీఆర్ఎస్ నాయకులు అసత్యప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు రాజ్యాధికారం అంశంలో బీఆర్ఎస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించలేమన్న భావనతో బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ కారుపోతుల శ్రీనివాస్, పోగు శ్రీనివాస్, ఎండీ మదార్, సలీం, పెనుగొండ రమేష్, బొమ్మగాని భాస్కర్, నలమాస రమేష్, పన్నీరు వెంకన్న , ఎల్లయ్య పాల్గొన్నారు.